క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాల్లో పట్టుబడితే జైలుకు

నాతవరం తహసీల్దార్ రమేష్‌కుమార్ హెచ్చరిక



బైండోవర్ అయిన వారికి హెచ్చరికలు చేస్తున్న తహసీల్దార్

నాతవరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి పట్టుబడితే లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్ష విధిస్తామని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో బైండోవర్ అయిన పది మందిని శనివారం తహసీల్దార్ వద్ద హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. బైండోవర్ అయిన వ్యక్తులు రెండోసారి తప్పు చేస్తే జైలుకు పంపిస్తామన్నారు. రెండోసారి వాయిదా ఉమ్మడి జిల్లా అరకు తహసీల్దార్ కార్యాలయానికి వేస్తామని హెచ్చరించారు. ఇక మీదట పరివర్తన కచ్చితంగా రావాలన్నారు.

రుణమాఫీ వర్తింపజేయాలని వినతి



డీసీసీబీ చైర్మన్ గురువులుతో పర్సన్ ఇన్‌చార్జి రాజేష్

మాడుగుల రూరల్: రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని, దీనివల్ల వారికి ఊరట కలుగుతుందని ఎం. కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ తెలిపారు. శనివారం ఆయన విశాఖలో డీసీసీబీ చైర్మన్ కోలా గురువులును మర్యాద పూర్వకంగా కలిశారు. తమ సొసైటీ పరిధిలో వాయిదా మీరిన రుణాలు ఎక్కువ మంది రైతులు చెల్లించాల్సి ఉందన్నారు. రుణమాఫీ చేయాలని కోరారు. అద్దె భవనంలో నడుస్తున్న సొసైటీకి పక్కా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

విద్యతోనే భవిష్యత్



కొండలఅగ్రహారంలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: విద్యతోనే భవిష్యత్ అని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. శనివారం కొండలఅగ్రహారం ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మెటివ్–3లో విద్యార్థులకు వచ్చిన మార్కుల వివరాలను వారికి తెలియజేశారు. విద్యార్థుల చదువు విషయంలో గురువులతోపాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. అనంతరం సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమంలో భాగంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఫొటోలు దిగారు. వారిని అభినందించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమాన్ని హెచ్‌ఎం కె.రాము నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో

నాతవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసే బాధ్యత సంబంధిత అధికారులదేనని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఉపాధి హామీ పథకం, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. పని అడిగిన అందరికి ఉపాధి కల్పించాలన్నారు. సచివాలయానికి పనుల మీద వచ్చే ప్రజల పట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని లేకుంటే చర్యలు ఉంటాయన్నారు.కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, జేఈలు జోగారావు, రాజేష్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పల్లెలు

- దేవరాపల్లి మండలంలో 16 అభివృద్ధి పనుల ప్రారంభం నేడు
- రూ. 8.95 కోట్లతో మైదాన, గిరిజన గ్రామాల్లో పూర్తి
- హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పెదనందిపల్లి సత్యనారాయణపురం కాలనీ నుంచి చేనులపాలెంకు నిర్మించిన తారురోడ్డు



చింతలపూడి సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు



తామరబ్బలో నిర్మాణం పూర్తయిన మంచినీటి ట్యాంకు

దేవరాపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో మైదాన, గిరిజన గ్రామాల రూపురేఖలు మారాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పల్లెలు వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమాభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఈ నేపథ్యంలో దేవరాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రూ. 8.95 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 16 అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

రెండు తారు రోడ్లు ప్రారంభోత్సవం....

రూ.1.23 కోట్లతో ఎన్.గజపతినగరం నుంచి కొత్తపెంట వరకు, రూ. 1.75 కోట్లతో పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం కాలనీ నుంచి చేనుపాలెం వరకు నిర్మించిన తారురోడ్లను డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు. రూ.43.60 లక్షలతో దేవరాపల్లిలో సచివాలయం–1 భవనాన్ని, రూ. 20 లక్షలతో కూరాకుల కల్లాలకు, రూ. 17 లక్షలతో రెల్లిపేట నుంచి రాయవరపు కల్లాలకు, రూ.11.25 లక్షలతో బందారు వారి కల్లాలకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించనున్నారు. రూ. 43.60 లక్షలతో చింతలపూడి పంచాయతీలో సచివాలయ భవనం, రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, వంతెవానిపాలెంలో రూ. 20 లక్షలు, పెదకోరాడలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను, చింతలపూడిలో రూ. 2.49 కోట్లతో చేపట్టిన ఇంటింటా కుళాయి పనులను ప్రారంభిస్తారు. తామరబ్బ పంచాయతీలో చినసోంపురం, లోవముకుందపురంలో రూ. రూ. 30 లక్షల చొప్పున వ్యయంతోను, తామరబ్బలో రూ. 40 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌లను, పాతబొడ్డపాడులో రూ. 30 లక్షలతో చేపట్టిన ఇంటింటా కుళాయిలను, తామరబ్బలో రూ. 20లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.



మాడుగుల మండలం వీరనారాయణంలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



వరహాపురం, పెదగోగాడ తారురోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం



బుచ్చమ్మ వారి పొలం కల్లాలకు వెళ్లే సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం

శరవేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

సచివాలయాల్లో పర్యవేక్షించిన మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో భానోజీరావు



ఎల్బీపురంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ

కె.కోటపాడు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారుల ఇంటి పట్టాలకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. చౌడువాడ, కె.కోటపాడు, కింతాడ గ్రామ సచివాలయాల్లో ఈ ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మూడు రోజుల వ్యవధిలో 239 లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ నిర్ణీత వ్యవధిలోనే పూర్తి కానుందన్నారు. చౌడువాడ పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, సౌందర్య, గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ తనూజ పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోటలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీవో బానోజీరావు శనివారం పరిశీలించారు. కొత్తకోటలో 197 మందికి గానూ 174 మందికి రిజిస్ట్రేషన్ ప్రారంభించామన్నారు. గ్రామ సర్పంచ్ కోన లోవరాజు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులు 1,600 మంది రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఇప్పటికే మండలం మొత్తమ్మీద 600 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటాచార్యులు తెలిపారు.

దోమల నివారణతో మలేరియా నిర్మూలన

విశాఖ జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ



కె.జె.పురం పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న శాంతిప్రభ

మాడుగుల రూరల్: దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా నిర్మూలించవచ్చని విశాఖ జోనల్ మలేరియా అధికారి ఎం. శాంతిప్రభ తెలిపారు. శనివారం ఆమె కె.జె.పురం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించి, నమోదైన మలేరియా కేసులు గురించి వైద్యాధికారులు లీలాప్రసాదు, ప్రసాదుపాత్రుడులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంత రం శంకరం గ్రామాన్ని, మాడుగుల ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఇక్కడ రోగుల్లో మలేరియా నిర్ధారణ అయితే సమాచారం అందించాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారులు బి. తిరుపతిరావు, ఎస్.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎం.కోడూరులో జిల్లా స్థాయి గుర్రాల పోటీలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో మోదకొండమ్మ తీర్థం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేం, రేసు గుర్రాల పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శనివారం తెలిపారు. ఎడ్ల బళ్ల పోటీల్లో మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1,500 చొప్పున అందజేస్తామన్నారు. గుర్రాల పోటీల్లో వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1,500 చొప్పున ఇస్తామన్నారు. సాయంత్రం కోలాటం, తప్పెట గుళ్లు, చిటికెల భజన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తామన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్



నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్డీవో కార్యాలయ సిబ్బంది

బుచ్చెయ్యపేట: విశాఖ రూరల్ తహసీల్దార్ రమణయ్యను హతమార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు బుచ్చెయ్యపేట తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌చంద్ర, జూనియర్ అసిస్టెంట్ చంద్రరావు, తదితరులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

ఆర్డీవో కార్యాలయ ఉద్యోగుల నిరసన

నర్సీపట్నం: విశాఖ రూరల్ తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడంపై ఆగ్రహిస్తూ శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యాలయ ఉద్యోగులు తేజ, సత్యనారాయణ, ఆశాజ్యోతి, బాలంనాయుడు, రాజు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుని ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. సిబ్బంది నారాయణ, రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట



పారిశుధ్య కార్మికులకు పుష్‌కాట్స్ అందజేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణతో కలిసి శనివారం పారిశుధ్య కార్మికులకు పుష్‌కాట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. వీధుల్లోనూ, ఇళ్లల నుంచి సేకరించిన చెత్తను చెత్త తరలింపు వాహనాలకు అందించాలన్నారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులు పని చేయాలన్నారు. శానిటేషన్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని అందిస్తామన్నారు. శానిటేషన్ నిర్వహణపై ఫిర్యాదులు రాకుండా అందరూ సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, డీఈ నారాయణ, ఏఈ రవి, మేనేజర్ శంకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: రక్తహీనత నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎంఈవో మూర్తి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ శనివారం విద్యార్థుల నుంచి వైద్య సిబ్బంది రక్త పూతలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ: విద్యార్థులు ఆరోగ్యం కోసం అన్ని పరీక్షలు చేస్తున్నామని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. శనివారం కోదులపాలెం పాఠశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ రక్త హీనత కలిగిన విద్యార్థులకు మందులు, ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తామన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దారు రత్నం సేవలు ప్రశంసనీయం



తహసీల్దారు పి.వి.రత్నంను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తహసీల్దారు పి.వి.రత్నం ప్రజల మన్ననలు పొందారని ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడి వెంకటరాజారామ్ అన్నారు. విజయనగరం జిల్లా బదిలీపై వెళ్లిన పి.వి.రత్నంకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, మండల పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఎస్ఐ దామోదర్‌నాయుడు, వీఆర్వోల యూనియన్ జిల్లా నాయకుడు కాళింగ పెదబాబు, డీలర్ల యూనియన్ అధ్యక్షుడు చింతా వెంకటరమణమూర్తి, కార్యదర్శి పెంటకోట జగన్నాథరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు సన్మానించి ఆయనకు జ్ఞాపికలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దారు పి. సత్యనారాయణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

గ్రామస్థాయి సేవలే సీఎం ధ్యేయం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ వెంకట సత్యవతి



కొవ్వూరు - బుచ్చింపేట తారురోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

రోలుగుంట: గ్రామస్థాయిలో ప్రజలకు అధికారుల సేవలందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయం అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను వారు శనివారం రాత్రి ప్రారంభించారు. వీటిలో కొమరవోలులో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20.8 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్, రూ.23.94 లక్షలతో పూర్తయిన రైతు భరోసా కేంద్రం, కుసర్లపూడిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌తోపాటు పీఎంజీఎస్‌వై నిధులు రూ.6.95 కోట్లతో కొవ్వూరు రోడ్డు నుంచి బుచ్చింపేట రోడ్డు(ఆర్బి)వరకూ పూర్తయిన తారు రోడ్డు ఉన్నాయి. ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామస్థాయిలోకి ప్రభుత్వ కార్యాలయాల సముదాయం సేవలు తీసుకొచ్చేందుకు కోట్లాది రూపాయల వెచ్చించి భవన నిర్మాణాలు పూర్తి చేయించామన్నారు. ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, సర్పంచ్‌లు గొర్లె రమణమ్మ, మడ్డు అప్పలనాయుడు, గుములూరి బాబులు, చిటికెల వెంకటసత్తిబాబు, యర్రంశెట్టి కాంతమ్మ, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టీవీ రమణ, పార్టీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, గొర్లె చెల్లంనాయడు, తమటపు సత్యంనాయుడు, వెంకట్రావు బుల్లిబాబు, సత్తిబాబు, ఇతర పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వచ్చే వారం నుంచి ఉపాధి పనులు

సామాజిక తనిఖీ మండల ప్రజా వేదికలో డ్వామా పీడీ సందీప్



మాట్లాడుతున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు సందీప్

మాడుగుల రూరల్: ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరు ఇ. సందీప్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 10,953 కుటుంబాలకు పనులు కల్పించామని, తద్వారా రూ.9.91 కోట్లు వేతనం రూపంలో కూలీలకు చెల్లించామన్నారు. మెటీరియల్ రూపంలో రూ.7 కోట్లు వెచ్చించామన్నారు. ఈ నెల రెండో వారం నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తామన్నారు. కొండపోడు భూములు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు ఉచితంగా 20 రకాలు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలు చేపట్టిన పనులు, ఇచ్చిన వేతనాల రికార్డులను తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి అపరాధ రుసుంగా రూ.5 వేల రికవరీ చూపించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఉపాధి హామీ పథకం అదనపు ప్రాజెక్టు అధికారి రోజారాణి, ఏపీడీ శ్రీనివాస్, మండల పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ యడ్ల కళావతి, ఏపీవో నవర వరహాలబాబు, డీఆర్పీలు, టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ పథకం కార్యాలయం సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నువ్వు పంటకు తెగుళ్ల బెడద

వేచలం రైతులకు కేవీకే శాస్త్రవేత్తల అవగాహన



వేచలంలో నువ్వు పంటపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: నువ్వు పంటను ఆశిస్తున్న తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, బాబు రైతులకు సూచించారు. నూనె గింజలలో సామూహిక ప్రథమ ప్రదర్శన క్షేత్రం పేరిట నువ్వు పంటలను వేచలంలో ఏవో వై. కాంతమ్మతో కలిసి వారు శనివారం పరిశీలించారు. వైఎల్ఎం 66 అనే రకం పంటలో ఆకుల మీద మచ్చలు నివారణకు కార్బండిజం లేదా మెంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. ఎకరానికి 400 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెర్రి తెగులు సైతం నువ్వు పంటను సోకడంతో మొక్కలు పూత దశలో ఉన్నప్పుడు మొవ్వ ఆకులు ముడతపడి చెట్టు ఎదుగుదల లోపించి చనిపోతుందన్నారు. దీని నివారణకు ఆస్ఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటికి పిచికారీ చేయాలని, ఎకరానికి 300 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని అవగాహన కల్పించారు. ముందుగా పొలానికి తడుపు పెట్టి మరుసటి రోజు పిచికారీ చేయడం ద్వారా వెర్రి తెగుళ్లను నివారించవచ్చునని సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్. కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నూతన అధికారులకు శుభాకాంక్షలు



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ, తదితరులు



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కె.కోటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవో బీఎస్‌కేఎస్ పట్నాయక్‌ను పంచాయతీ కార్యదర్శులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా నుంచి ఇక్కడకు ఆయన వచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, కె.భీమరాజు, ప్రశాంత్, ప్రసాద్, సౌందర్య, ధర్మ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎంపీపీ

మాకవరపాలెం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ మురళీమోహనరావును ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, తూటిపాల, మామిడిపాలెం సర్పంచ్‌లు ప్రసాద్, రమణ, నాయకులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

గొలుగొండ : కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు కిలోల గంజాయితో ముగ్గురు నిందితులు పట్టుబడినట్టు కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గుంటూరు జిల్లాకు చెందిన కార్తీక్, మోహన్, జ్యోతిబాబు బ్యాగ్‌తో నడిచి వెళుతుండగా, అనుమానం వచ్చి తనిఖీలు చేశామన్నారు. దాంతో బ్యాగ్‌లో గంజాయి బయటపడిందని, ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

రోలుగుంట తహసీల్దార్‌గా రవిచంద్ర



రోలుగుంట: స్థానిక తహసీల్దార్‌గా కంఠా రవిచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా పాతపట్నం తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కైసర్ల వరహాలు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.